ఎంవీపీ కాలనీలో ట్రా'ఫికర్'

- క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో నరకయాతన
- రామలక్ష్మీ అపార్ట్‌మెంట్ రోడ్డులో స్తంభిస్తున్న వాహనాలు


క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్ జామ్ కారణంగా నిలిచిపోయిన వాహనాలు


రామలక్ష్మీ అపార్ట్‌మెంట్ కూడలిలో వాహనాల రద్దీ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వాల్తేర్ నుంచి శివాజీపాలెం మీదుగా హైవేకు చేరుకోవాలన్నా, ఎంవీపీ కాలనీ నుంచి ఏయూ మీదుగా జగదాంబ జంక్షన్ చేరుకోవాలన్నా రామలక్ష్మీ అపార్టుమెంట్స్ కూడలి రోడ్డు అత్యంత కీలకం. హైవే తరువాత తూర్పు నియోజకవర్గం వాసులు అత్యధికంగా వినియోగించేది ఈ రహదారినే. దీంతో ఈ మార్గం రోజురోజుకూ వాహనాల రద్దీతో కిటకిటలాడుతోంది. అయితే ఈ రహదారిలో వచ్చే వాహనాలకు విశాలంగా ఉండే ఏఎస్ రాజా, ఉషోదయ కూడళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఉండడం లేదు. చిన్నదిగా ఉండే రామలక్ష్మీ అపార్ట్‌మెంట్ కూడలి మాత్రం కష్టాలను తెచ్చిపెడుతోంది. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు పెద్ద ఎత్తున ఇక్కడ నిలిచిపోతున్నాయి. రాకపోకల్లో ఏ ఒక్క వాహనం తప్పిదం చేసినా కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో ఎటూ కదల్లేక వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రద్దీ కూడలిలో చాలా మంది వాహనదారులు తప్పిదం కారణంగా ట్రాఫిక్‌కు ఎక్కువ సార్లు అంతరాయం ఏర్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో..

టీటీడీ కూడలి నుంచి ఎంవీపీ కాలనీలోని క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ మార్గంలో రెండు వైపులా షాపులు పెరిగిపోవడంతో పాటు రైతుబజార్‌కు వెళ్లే వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా సాయంత్రం పూట వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి వ్యాపారులు షాపులను రోడ్డుపై నిర్వహించకుండా చర్యలు చేపడుతున్నా అవి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో సమస్యకు పూర్తి పరిష్కారం లభించడంలేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వాహనచోదకుల రద్దీ కారణంగా సాయంత్రం పూట ఆయా కూడళ్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, ఎంవీపీ కాలనీ

క్లుప్తంగా

15వ వార్డులో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో కనకమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ వీక్షణ


మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: మన్ కీ బాత్ 104వ కార్యక్రమాన్ని లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నగర నాయకులు వీక్షించారు. ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బీవీపీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకార వేడుకలో పాల్గొన్న బీవీపీ కార్యవర్గ సభ్యులు

దాబాగార్డెన్స్: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) నార్త్ ఈస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో జరిగింది. 2023–24 ఏడాదికి అధ్యక్షుడిగా ఎస్.సోమరాజు, కార్యదర్శిగా జేసీ శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా పి.రవికుమార్‌తో ఆర్పీ జైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ అక్షయ పాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యదురాజ దాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావంతో ఉన్నత లక్ష్యంతో ప్రతి సభ్యుడు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. భారత్ వికాస్ పరిషత్ దేశభక్తితో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధులు రమేష్‌చంద్ జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, రాష్ట్ర ప్రతినిధి వంకాయల సన్యాసిరాజు మాట్లాడుతూ బీవీపీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ రాష్ట్ర సంస్కార్ ప్రముఖ్ ఎంవీ రాజశేఖర్, మహిళా శాఖ అధ్యక్షురాలు టి.సత్యశ్రీ, వివిధ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

500 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు


ఖైదీలకు పరీక్షలు చేస్తున్న ఏఎంసీ డీవీఎల్ విభాగం వైద్య సిబ్బంది

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) డీవీఎల్ విభాగం వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ ఖైదీలకు చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. 500 మంది ఖైదీలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, వారిలో సుమారు 200 మందికి వివిధ రకాల మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.గురుప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత్, కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, జైలు వైద్యురాలు ఈశ్వరిదేవి పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స


వైద్యులు శస్త్ర చికిత్స చేస్తున్న కాలి భాగం

ఆరిలోవ: హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ రెండు రోజుల కిందట ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. నగరానికి చెందిన 54 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రెండేళ్లుగా కాలి మడమ వద్ద నొప్పి, వాపుతో బాధపడుతున్నారు. ఆయన హెల్త్‌సిటీ అపోలోలో సంప్రదించడంతో ఎంఆర్ఐ స్కాన్ చేయగా.. హగ్లండ్స్ వైకల్యంతో బాధపడుతున్నట్టు గుర్తించామని అబ్దుల్ తెలిపారు. వెంటనే థెరప్యూటిక్ హిండ్ ఎండోస్కోపీ అండ్ కాల్కానియోప్లాస్టీ అనే శస్త్ర చికిత్స చేశామన్నారు. రోగిని 24 గంటల్లో డిశ్చార్జ్ కూడా చేశామన్నారు. ఈ విధమైన ప్రక్రియ ద్వారా శస్త్ర చికిత్స చేయడం రాష్ట్రంలో ఇదే మొదటిసారని, ఇది ఎంతో సున్నితమైన, అరుదైన శస్త్ర చికిత్స అని అబ్దుల్ తెలిపారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి


మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ సునీత

మురళీనగర్: లక్ష్యం నిర్దేశించుకోవడంతోపాటు దాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ సునీతామూర్తి రామవరపు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గైస్, ఐఎస్‌టీడీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన 'విజయం వైపు పయనం' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యను అభ్యసించే వారు తప్పనిసరిగా కంపెనీలకు అవసరమైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం ముఖ్యమని పేర్కొన్నారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఆర్ఎం రావ్, కాలేజీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎక్స్‌రే గది తెరిచేదెప్పుడో?

- ఆరిలోవ ఎఫ్ఆర్‌యూలో మూలకు చేరిన ఎక్స్‌రే
- పట్టించుకోని రెడ్‌క్రాస్ సంస్థ నిర్వాహకులు


ఆరిలోవ ఎఫ్ఆర్‌యూలో తాళం వేసి ఉన్న ఎక్స్‌రే గది

ఆరిలోవ: స్థానిక జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ)లోని ఎక్స్‌రే యూనిట్ మూలకు చేరింది. సుమారు ఏడాది నుంచి ఎక్స్‌రే ఆపరేటర్ లేకపోవడంతో ఈ గదికి తాళం వేసి మూసివేశారు. కొన్నేళ్లుగా ఇక్కడ పనిచేసిన ఆపరేటర్‌కు గతేడాది ప్రభుత్వ కొలువు రావడంతో వేరే చోటకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇంత వరకు కొత్త ఆపరేటర్‌ను నియమించలేదు. ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు చూస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ నిర్వాహకులు దీనిపై దృష్టిపెట్టకుండా వదిలేశారు. దీంతో ఏడాదిగా ఎక్స్‌రే సేవలు రోగులకు అందకుండా పోతున్నాయి. ఇక్కడ వైద్యులతో పాటు బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు, ఎక్స్‌రే యూనిట్ సేవలు, మందులు నిరంతరం రోగులకు అందజేయాల్సి ఉంది. అయితే నిర్వహణ బాధ్యతలను జీవీఎంసీ రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించింది. పర్యవేక్షణ వైద్యాధికారులు చేస్తారు. పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు తూతూమంత్రంగా ఇక్కడ సేవలు అందిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎక్స్‌రే సేవలు పునరుద్ధరిస్తాం..

ఆరిలోవ ఆస్పత్రిలో వెంటనే ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. నిర్వాహకులతో మాట్లాడి ఆపరేటర్‌ను నియమించే ఏర్పాట్లు చేస్తాం. ఆస్పత్రి నిర్వహణ సమయం కూడా రెడ్‌క్రాస్‌కు కొద్ది రోజుల్లో ముగియనుంది. మళ్లీ కొత్తగా టెండర్ పిలుస్తాం. ఆ టెండరులో నిలిచిన వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం.

– డాక్టర్ ఇ.వి.ఎస్.సురేష్‌కుమార్, సీఎంవో, జీవీఎంసీ

తప్పిన ప్రమాదం


కారుషెడ్ కూడలిలో డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై పెద్ద ప్రమాదం తప్పింది. కొమ్మాది కూడలి నుంచి నగరం వైపునకు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో కారు డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారు నుజ్జవగా అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక ట్రాఫిక్ ఏఎస్ఐ ఎం.సతీష్ వెంటనే స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సంఘటన స్థలం నుంచి కారును తరలించడానికి చర్యలు చేపట్టారు.

శ్రావ్యంగా కచేరీ



కచేరీ చేస్తున్న ఎస్.సుభాని

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఒంగోలుకు చెందిన మాండోలిన్ విద్వాంసుడు ఎస్.సుభాని కచేరీ శ్రావ్యంగా సాగింది. ఈ కచేరీకి వయోలిన్ సహకారం విజయవాడకు చెందిన దుర్గాభవాని, మృదంగం సహకారం విజయనగరానికి చెందిన శ్రీమహదాసు ఏడుకొండలు, ఘటం సహకారం శ్రీకాకుళానికి చెందిన బంకుపల్లి దుర్గాప్రసాద్ అందించారు.

ఎండాడ పాఠశాలకు క్రీడా పురస్కారం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 2022 – 23 విద్యా సంవత్సరానికి క్రీడా ప్రతిభ పురస్కారం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిపూర్ణ తెలిపారు. జిల్లాలో స్కూల్ గేమ్స్‌లో అత్యధికంగా రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం, పతకాలు సాధించడం వల్ల పాయింట్ల ఆధారంగా పురస్కారం లభించినట్లు తెలిపారు. ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా డీఈవో చంద్రకళ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటామని ఆమె తెలిపారు.

విద్యార్థులకు పోటీలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొమ్మాది: వచ్చేనెల 6 నుంచి 8 వరకు బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఇక్కడి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్, కృష్ణలీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణ, వంట, పూల అలంకరణ, రంగోలీ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శ్రీకృష్ణాష్టమి రోజున బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తెలిపారు.

స్వచ్ఛ విశాఖ లక్ష్యం


కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు

కొమ్మాది: స్వచ్ఛ విశాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొని బీచ్ తీరం వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తీరంలో 3.5 టన్నుల వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో అడిషినల్ కమిషనర్ సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయంలో ఆదివారం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి


భరతనాట్య నృత్య ప్రదర్శనలో చిన్నారులు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం

మద్దిలపాలెం : మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలని, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. గురజాడ కళా క్షేత్రంలో ఆదివారం భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరతనాట్యం, కూచిపూడి నృత్యాలలో చిన్నారులకు ప్రావీణ్యం కల్పించడానికి కృషి చేయాలన్నారు. విద్యతో పాటు కళల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం భరతనాట్య కళాంజలి అకాడమీ విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ సంతోషి విజయ్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కన్నం వెంకటరమణ, చెన్నై కళా క్షేత్రం ఆచార్యులు వసుంధర థామస్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు మేయర్, అతిథులు బహుమతులు అందజేశారు.

ఎంపీ ఎంవీవీ దృష్టికి 15వ వార్డు సమస్యలు


ఎంపీ ఎంవీవీతో సమావేశమైన అప్పారి గిరిబాబు, కార్పొరేటర్ శ్రీవిద్య, తదితరులు

మద్దిలపాలెం : విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు స్వగృహానికి ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తూర్పు సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంవీవీ స్థానిక కార్పొరేటర్‌తో పాటు, వార్డులో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమన్వయకర్తగా వార్డులో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వార్డులో ప్రధాన సమస్యగా ఉన్న సింహాచలం దేవస్థానం పరిధిలోని జీవో 275లో ఉన్న భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వడానికి కృషి చేయాలని కార్పొరేటర్ శ్రీవిద్య కోరారు. కొత్త, పాత వెంకోజీపాలెం గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు పీలా వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలి'


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందిస్తున్న వెంకటేశ్వరరావు

బీచ్ రోడ్డు: ఉత్తమ ప్రతిభతో స్కాలర్‌షిప్‌లు పొందుతున్న విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకుని స్కాలర్‌షిప్‌లిచ్చే స్థాయికి ఎదగాలని రోటరీ క్లబ్ కాబోయే గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో ఎల్ ఏంజెల్ ఇంటర్నేషనల్ వలంటీర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సంయుక్తంగా 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం విశ్వగురు కావాలంటే నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. మూడేళ్లుగా ప్రతి ఏటా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ విశాఖ వ్యాలీ అధ్యక్షుడు పాండురంగరాజు, మండ జానకిరామ, తదితరులు పాల్గొన్నారు.

జాలరిపేటలో రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని పెద జాలరిపేటలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒలిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా మూర్తి మదర్ థెరిసా స్ఫూర్తితో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడవచ్చునన్నారు. అనంతరం ఈ శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, గురునాథ్, రవికుమార్, కాశీ, కమల్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐలు, ధర్మేంద్ర, అప్పలరాజు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ రౌడీషీటర్ల దినచర్యపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎవరు ఎక్కడికి వెళ్లిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వైన్ షాపులు, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా ఉండాలని చెప్పారు. నేరాలకు జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

1 నుంచి 'శ్రీకృష్ణ కథా సప్తాహం'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు శ్రీకృష్ణ కథామృత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్లో ఆదివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారు ప్రవచిస్తారని చెప్పారు.

ప్రతి రోజూ ముందుగా విష్ణు సహస్ర నామ పారాయణ, శ్రీకృష్ణ పూజ జరుగుతుందన్నారు. భక్తులు ఈ మహత్తర పారాయణ. ప్రవచన కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ ఆశీర్వాదం పొందాలని కోరారు. నారాయణనంద భారతీస్వామి, చంద్రశేఖర్ మాస్టారు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.